

సాక్షి అనకాపల్లి

శనివారం । 11 । మే । 2024



సుందర.. పట్నం

గత ఐదేళ్లలో నర్సీపట్నం రూపురేఖలు మారిపోయాయి. సుందరీకరణ పనులతో పట్టణం కళకళలాడుతోంది. VIIIలో



అభివృద్ధి కేరాఫ్ అనకాపల్లి

జిల్లా కేంద్రం అనకాపల్లిలో ప్రగతి వీచికలు వీస్తున్నాయి. పార్కులు, బడులు, ఆస్పత్రులతో అభివృద్ధి పథంలో పయనిస్తోంది. Xలో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.3/24.0

తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

నిజరూపం.. అపురూపం

వైభవంగా అప్పన్న చందనోత్సవం

- స్వామి నిజరూపాన్ని దర్శించి పరవశించిన భక్తజనం
- తెల్లవారుజాము 2.30 గంటల నుంచే సర్వదర్శనాలు ప్రారంభం
- స్వామిని దర్శించుకున్న శారదా పీఠాధిపతులు





క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు (ఇన్‌సెట్) శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామి నిజరూపం నేత్రపర్వంగా దర్శనమిచ్చింది. ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే లభించే స్వామి నిజరూప దర్శనంతో భక్తులు పరవశులయ్యారు. వైశాఖ శుద్ధ తదియను పురస్కరించుకుని నిర్వహించిన అప్పన్న చందనోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుప్రభాతసేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విగ్వరణం, కలశారాధన చేశారు. అనంతరం వెండి బొరుగుతో స్వామిపై ఉన్న పన్నెండు మణుగుల చందనాన్ని ఒలిచి నిజరూపభరితున్ని చేశారు. తదుపరి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం తెల్లవారుజామున 2.15 గంటల సమయంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబసమేతంగా స్వామివారి తొలిదర్శనాన్ని చేసుకున్నారు. తెల్లవారుజామున 2.30 గంటల నుంచి ఉచిత, రూ.300, రూ.1000, రూ.1500 క్యూల్లో ఉన్న భక్తులకు దర్శనాలు కల్పించారు.

ఘనంగా సహస్ర ఘటాభిషేకం

రాత్రి సుమారు 9 గంటల నుంచి సహస్ర ఘటాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు త్రిదండి చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో సింహగిరిపై ఉన్న గంగధార నుంచి వెయ్యి కలశాలతో శ్రీ వైష్ణవస్వాములు గంగా జలాలను తీసుకువచ్చారు. ఆ జలాలతో స్వామి నిజరూపాన్ని అర్చకులు అభిషేకించారు . అలాగే 108 వెండి కలశాలతో ఔషధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. స్వామికి విశేషంగా పూజలు నిర్వహించి, తొలివిడతగా 120 కిలోల చందనాన్ని సమర్పించి మళ్లీ నిత్యరూపభరితున్ని చేశారు.

పట్టువస్త్రాలు సమర్పించిన దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

చందనోత్సవాన్ని పురస్కరించుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికల్ వలెవన్ పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామిని దర్శించుకున్నారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున స్వామికి పట్టువస్త్రాలను దేవస్థానం ప్రతినిధులు సమర్పించారు.

స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి నిజరూపాన్ని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ ఏ.వి.రవీంద్రబాబు, జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ ఎం.కిరణ్మయి, దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, అదనపు కమిషనర్ విశ్వనాథం, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, నగర సీపీ రవిశంకర్, ఎన్నికల అబ్జర్వర్ అమిత్ శర్మ తదితరులు దర్శించుకున్నారు.

అద్భుతంగా చందనోత్సవం : ఈ ఏడాది చందనోత్సవం అద్భుతంగా జరిగిందని విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి కొనియాడారు. దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతేడాది జరిగిన లోటుపాట్లను సరిదిద్దుకుని ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేసిందన్నారు. పూర్తిగా సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తూ ఈ సారి చందనోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభు త్వం కూడా సింహాచలం క్షేత్రానికి వెళ్లే రోడ్లను వెడల్పు చేయడం చాలా అభినందనీయమన్నారు. దాదాపు 50 ఏళ్లుగా విస్తరణ జరగని రోడ్లను వెడల్పు చేసి, సింహాచలం క్షేత్రానికి వెళ్లే మార్గానికి నూతన శోభ చేకూర్చారన్నారు. దేవదాయశాఖ కమిషనర్, కలెక్టర్, దేవస్థానం ఈవోను అభినందించారు. రెండు తెలుగు రాష్ట్రాలూ ఈ ఏడాది ఆర్థికంగా, ఆయా రాష్ట్ర ప్రజలు ఆరోగ్యకరంగా, అన్నిరకాలుగా బాగుండాలని స్వామిని కోరుకున్నానని తెలిపారు.



గంగధార నుంచి కలశాలతో జలం తీసుకువస్తున్న చిన్నజీయర్ స్వామి

ప్రశాంతంగా దర్శనాలు

తోపులాటలు.. గంటల తరబడి నిరీక్షణ.. అసౌకర్యం అనే పరిస్థితేమీ లేకుండా అప్పన్న చందనోత్సవం ప్రశాంతంగా జరిగింది. భక్తులంతా స్వామి వారిని తనివితీరా దర్శించుకుని, ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథం దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు చిన్నపాటి అసౌకర్యం కూడా కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. గురువారం అర్ధరాత్రి నుంచే ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. తెల్లవారుజామున 4గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభమవుతాయని ముందుగా ప్రకటించినా గంటన్నర ముందుగానే (సుమారు 2.30గంటల సమయంలో) సర్వదర్శనాలు ప్రారంభించడం విశేషం. సర్వదర్శనం వారికి సుమారు మూడున్నర గంటలు, 300వందల టిక్కెట్లు కలిగిన వారికి రెండు గంటల నుంచి రెండున్నర గంటల వ్యవధి, 1000 రూపాయల టిక్కెట్టు ఉన్నవారు గంట నుంచి గంటన్నర వ్యవధిలోనే దర్శనం చేసుకోవడం విశేషం.

నేటితో ప్రచారానికి తెర

- మీడియాలో ప్రసారాలు నిషేధం
- సోషల్ మీడియా సహా అన్ని మాధ్యమాలపై నిఘా



తుమ్మపాల: జిల్లాలో ఎన్నికల ప్రచార గడువు శనివారంతో ముగియనుంది. సాయంత్రం 6 గంటలు దాటితే ఎటువంటి ఎన్నికల ప్రచారాలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు చేపట్టకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల నిబంధల ప్రకారం ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు రెండు రోజుల ముందుగా ప్రచారాలు ముగించాలి. నగదు, మద్యం పంపిణీపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ప్రత్యేక నిఘా ఉంటుంది. శనివారం సాయంత్రం నుంచి అమలు చేయనున్న సైలెన్స్ పీరియడ్‌లో అభ్యర్థుల ప్రచారాలతో పాటు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా మాధ్యమాల్లో ప్రసారాలు నిషిద్ధమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి తెలిపారు. బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. సోషల్ మీడియా మాధ్యమాల్లో నిబంధనల ఉల్లంఘనపై కూడా ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

ప్రతి నియోజకవర్గంలో డీఎస్పీ స్థాయి అధికారులు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిష్పక్షపాతంగా జరిగేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకుడు, ఎస్పీ కె.వి. మురళీకృష్ణతో కలిసి పోలీసు అధికారులు, కేంద్ర బలగాల అధికారులతో శాంతిభద్రతల నిర్వహణ విషయమై చేపడుతున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి డీఎస్పీ స్థాయి పోలీసు అధికారులను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కడా తీవ్ర స్థాయి గొడవలు తలెత్తే అవకాశం లేదని, అయినా పోలీసు అధికారులు, భద్రతా దళాలు అత్యంత జాగరూకతతో విధి నిర్వహణ చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తీసుకు వెళ్లేటప్పుడు వాహనాన్ని మధ్యలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపరాదన్నారు. పోలింగ్ సమయంలో మొదటి మూడు గంటలు, ఆఖరు రెండు గంటలు కీలకమైనవన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇంటెలిజెన్స్ రిపోర్టు ద్వారా ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ 'నో వైలెన్స్–నో రీపోల్' అనే భావంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. సమస్యాత్మక కేంద్రాలకు తగిన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల పరిశీలకుడు దల్జీత్‌సింగ్ మాట్లాడుతూ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అందరూ కృషి చేయాలన్నారు. ఆఖరు రెండు రోజుల్లో వివిధ స్థాయిల్లో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే అవకాశాలు ఉన్నందున సూక్ష్మ స్థాయిలో తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సాధారణ పరిశీలకులు రాకేష్‌కుమార్, మోహన్ దహికర్, రామస్వామి, ఏఎస్పీ బి.విజయభాస్కర్, ఆరు నియోజకవర్గాల డీఎస్పీలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, ఎన్నికల పరిశీలకుడు దల్జీత్‌సింగ్

న్యూస్‌రీల్

కరుణించిన వరుణుడు



యలమంచిలి గాంధీనగరం వీధిలో వర్షంతో రోడ్డుపై చేరిన వర్షపునీరు

యలమంచిలి రూరల్ : వరుణదేవుడు కరుణించాడు. జిల్లాలో పలుచోట్ల శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు అధిక ఉష్ణోగ్రతతో ఎండ తారెత్తించగా..సాయంత్రం ఉన్నట్టుండి మబ్బులు కమ్ముకుని, వర్షం కురిసి, వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. యలమంచిలి, కశింకోట, అనకాపల్లి, ఎస్. రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వాన కురిసింది. చల్లబడిన వాతావరణంతో జిల్లా ప్రజలు ఒకింత సేదతీరారు.

అనకాపల్లిలో 15.5 మిల్లీ మీటర్లు వర్షం

అనకాపల్లి : పట్టణంలో ఒక్కసారిగా సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురవడం వల్ల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనకాపల్లి పట్టణంలో 15.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగశాస్త్రవేత వి.గౌరి చెప్పారు.

మద్యంతో పట్టుబడ్డ టీడీపీ నేత

మునగపాక : మండలంలోని అరబుపాలెం ఉప సర్పంచ్, టీడీపీ నేత కృష్ణ శుక్రవారం మద్యం సీసాలతో పట్టుబడ్డారు. ముందస్తు సమాచారంతో మునగపాక పోలీసులు శుక్రవారం అరబుపాలెంలో గాలింపులు చేపట్టగా గ్రామానికి చెందిన టీడీపీ నేత కృష్ణకు సంబంధించిన పొద్దుతిరుగుడు పంటలో రెండు బస్తాలతో మద్యం సీసాలు ఉన్నట్టు గుర్తించారు. దీంతో కృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మద్యం ఎక్కడ నుంచి వచ్చిందని ఆరా తీస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం సరఫరా చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు చేస్తున్న కుతంత్రాల్లో భాగంగా అక్రమ మద్యాన్ని పోలీసులు పట్టుకోవడం సంచలనమైంది. కాగా ఎంత మొత్తంలో సీసాలు ఉన్నాయనే విషయమై నిర్ధారించలేదు.

చిన్నారులను రక్షించిన బీచ్‌గార్డ్

అల్లిపురం (విశాఖ): మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి గోకుల్ పార్క్ వద్ద శుక్రవారం సాయంత్రం రెల్లివీధికి చెందిన కె. సాగర్, వి.గణేష్ అనే ఇద్దరు చిన్నారులు స్నానానికి దిగారు. అయితే అలల తాకిడికి వారు సముద్రంలో కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న బీచ్‌గార్డ్ ఎం.ధనరాజు గమనించి వారిని రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చాడు.

ఎలక్షన్ స్పెషల్స్!

- పోలింగ్ దృష్ట్యా ప్రత్యేక బస్సులు
- విశాఖ నుంచి 50 బస్సులు సిద్ధం



సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలకు ఈనెల 13న పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఈ బస్సులను ప్రయాణికులతో పాటు పోలింగ్ సిబ్బంది కోసం సిద్ధం చేస్తున్నారు. అలాగే ఈ బస్సులను ఎన్నికల సామగ్రిని ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు తరలించడానికి కూడా వినియోగించనున్నారు. విశాఖ జిల్లాకు సంబంధించి ఎక్కువ బస్సులను ఉపయోగించాల్సిన అవసరం ఉన్నందున నగరంలో తిరిగే సిటీ బస్సులను కేటాయించనున్నారు. అందువల్ల ఈనెల 12, 13 తేదీల్లో నగరంలో ప్రయాణించే సిటీ బస్సులు అందుబాటులో ఉండవని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఓటర్లు, ప్రయాణికుల సౌకర్యార్థం అంతర జిల్లాల ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడుపుతామని స్పష్టం చేశారు. 13వ తేదీన పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి వారికి కేటాయించిన ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచుతున్నారు. విశాఖపట్నం నుంచి చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాలకు 12వ తేదీ ఉదయం 4 గంటల నుంచే విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఆరోజు ఉదయం 4 గంటలకు చోడవరానికి 30 బస్సులు, మాడుగులకు 8, అనకాపల్లి, యలమంచిలికి 4, పాయకరావుపేటకు 4, నర్సీపట్నం నాలుగు బస్సులు చొప్పున వెరసి 50 బస్సులను నడుపుతున్నట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు

అనకాపల్లి : ప్రశాంత వాతావరణంలో జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. తమ కార్యాలయంలో శుక్రవారం కేంద్ర బలగాలు, తమ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు 72 గంటల ముందు పోలీసులు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన దిగువ స్థాయి సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అక్రమ మద్యం, డబ్బులు, ఇతర వస్తువులు కట్టడి, వాహనాల తనిఖీ, సెర్చ్ –సీజర్‌లు, పోలింగ్ స్టేషన్ల నిర్వహణ వంటి వాటిపై తెలియజేయడం జరిగిందన్నారు. ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్ నుంచి పోలింగ్ స్టేషన్లకు చేరుకునే వరకు, ఓటింగ్ ముగిసిన తర్వాత పోలైన ఈవీఎంలను రిసెప్షన్ సెంటర్లకు చేరే వరకు కేంద్ర పోలీసు బలగాల ఎస్కార్ట్ పటిష్టంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, పరవాడ, నర్సీపట్నం డీఎస్పీలు కె.వి. సత్యనారాయణ, జి.ఆర్.ఆర్.మోహన్, సీఐలు చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, ట్రైనీ ఐపీఎస్‌లు పాల్గొన్నారు.



కేంద్ర బలగాలు, దిగువస్థాయి పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

కేంద్ర బలగాల పర్యవేక్షణలో ఈవీఎం భద్రత

జిల్లాలో 6 అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. తమ కార్యాలయంలో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. స్ట్రాంగ్ రూముల నుంచి ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామాగ్రి, రూట్ అధికారుల సహకారంతో పోలింగ్ బూత్‌కు కేంద్ర బలగాల సహాయంతో తీసుకువెళ్లాలన్నారు. ఎన్నికల విధుల్లో ఎటువంటి అలసత్వం వద్దన్నారు. 100 మీటర్ల పరిధిలో ఓటర్లు మినహా ఇంకెవరినీ అనుమతించకూడదని, 200 మీటర్లు దూరంలోనే వాహనాలను నిలిపి వేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ 16,456

తుమ్మపాల: జిల్లాలో పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌లో మొత్తం 16,456 మంది పాల్గొన్నారని జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి శుక్రవారం తెలిపారు. జిల్లాలో ఓటు కలిగిన 12,309 మంది, ఇతర జిల్లాలకు చెందిన 4,147 మంది పోలింగ్ తేదీ కంటే ముందే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. వీరిలో ఎన్నికల విధుల్లో ఉన్న అనకాపల్లి జిల్లావారు 9,969 మంది, ఇతర జిల్లాల వారు 4,065 మంది కాగా, అత్యవసర సేవల విభాగంలో జిల్లాకు చెందిన 1,374 మంది, ఇతర జిల్లాల వారు 82 మంది ఉన్నట్లు తెలిపారు. 85 ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగులు 966 మంది హోమ్ ఓటింగ్ ద్వారా వారి ఇళ్ల వద్దనే ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నియోజకవర్గాల వారీగా ముందుగా ఓటు వేసిన వారి వివరాలు

నియోజకవర్గం	జిల్లాలో ఓటర్లు	ఇతర జిల్లాల ఓటర్లు	మొత్తం
చోడవరం	2,093	575	2,668
మాడుగుల	1,741	681	2,422
అనకాపల్లి	2,177	1,191	3,368
యలమంచిలి	1,810	708	2,518
పాయకరావుపేట	1,775	597	2,372
నర్సీపట్నం	2,713	395	3,108
మొత్తం	12,309	4,147	16,456

ఐపీఆర్‌లో పీజీ డిప్లొమాకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సెంటర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఆధ్వర్యంలో 2024–25 సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్న పీజీ డిప్లమా ఇన్ ఐపీఆర్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం సంచాలకుడు డాక్టర్ హెచ్.పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 15వ తేదీలోగా ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశం పొందవచ్చునని పేర్కొన్నారు.

మృత్యుఘోష

రెండు విషాద ఘటనలు నలుగురి ప్రాణం తీశాయి. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదాలు వారి కుటుంబాల్లో విషాదం నింపాయి. తెలతెలవారుతుండగానే పూడిమడకలో రొయ్యల చెరువు గట్టుపై ఇద్దరు మత్స్యకారులు విగత జీవులై కనిపించారు. కరెంటు కాటేయడంతో వీరు మృతి చెందారు. బుచ్చెయ్యపేట మండలంలోని విజయరామరాజుపేట గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకులను బలిగొంది. మరణంలోనూ వీడని వీరి స్నేహబంధం అందరినీ కదిలించింది.

కరెంటు కాటేసి ఇద్దరు మత్స్యకారులు..



విగత జీవులుగా పడివున్న మత్స్యకారులు

అచ్యుతాపురం: పూడిమడకలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర విషాద ఘటన జరిగింది. రొయ్యల చెరువు గట్టుపై కడపాలేనికి చెందిన ఇద్దరు యువకులు విగత జీవులుగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాలు.. చోడపల్లి రాజు (27), యజ్జల సోమునాయుడు(25) కూలీలుగా పనిచేస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజాము సమయంలో వీరిద్దరూ ఇన్‌ఫోసిస్ సమీపంలోని రొయ్యల చెరువు వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. రాత్రి వేళ ఆ ప్రాంతానికి ఎందుకు వెళ్లారో స్పష్టంగా తెలియరావటం లేదని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనకు గల కారణాలను మత్స్యశాఖ, విద్యుత్ శాఖ అధికారుల దర్యాప్తులో తేలుతుందని సీఐ బుచ్చిరాజు తెలిపారు. మృతులిద్దరూ సమీప బంధువులు. వీరి మరణంతో కడపాలెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చోడపల్లి రాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమునాయుడు అవివాహితుడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బుచ్చిరాజు తెలిపారు.

ఫెన్సింగ్‌కు అనుమతి ఉండదు: మత్స్యశాఖ అధికారి రవిరాజ్

పూడిమడక పరిధిలో రొయ్యల చెరువులకు కొన్ని అనుమతులు ఉన్నాయని అచ్యుతాపురం మత్స్యశాఖ అధికారి రవిరాజ్ తెలిపారు. అయితే రొయ్యల చెరువులకు రక్షణగా ఎటువంటి ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ వేసేందుకు అనుమతి ఉండదని, చెరువు చుట్టూ విద్యుత్ దీపాలకు, ఏరియేటర్స్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో మత్స్యశాఖ అధికారి చెప్పినట్లు ఫెన్సింగ్ వల్ల మత్స్యకారులు చనిపోతే కచ్చితంగా నిర్వాహకుల తప్పిదమే అవుతుందని తెలుస్తోంది. మరోవైపు ఆ సమయంలో మత్స్యకారులు అటుగా ఎందుకు వెళ్లారో తెలియాల్సి ఉంది. గతంలో ఈ ప్రాంత రొయ్యల చెరువుల్లో రొయ్యలు చనిపోవడం, దీనిపై ఫిర్యాదులు వెళ్లిన సంగతి తెలిసిందే. రొయ్యల చెరువులకు సంబంధించి అనుమతులు, విద్యుత్ వైర్లు అమరుస్తున్న తీరు, రాత్రి వేళ స్థానికుల సంచారం వంటి అంశాలపై అధికారులు తగిన సూచనలు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

వ్యాన్ ఢీకొని ఇద్దరు మిత్రులు..



ద్విచక్రవాహనంపైకి దూసుకొచ్చిన వ్యాన్



విస్సారపు గణేష్, శీలం మధు (ఫైల్)

బుచ్చెయ్యపేట : మండలంలోని విజయరామరాజుపేట గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మాడుగుల మండలం వీరవల్లి అగ్రహారానికి చెందిన శీలం మధు (30), బైక్ మెకానిక్ విస్సారపు గణేష్ (32 స్నేహితులు. వడ్డాదిలో మధు బైక్ మెకానిక్‌గా, గణేష్ దాబా నిర్వహిస్తూ జీవిస్తున్నారు. శుక్రవారం వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై చోడవరం వెళ్తుండగా విజయరామరాజుపేట వద్ద ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొని బైక్ పైకి ఎక్కడంతో ద్విచక్ర వాహనం పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో గణేష్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్న మధును స్థానికులు, కుటుంబ సభ్యులు చోడవరం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్నేహితులిద్దరు మృతి చెందడంతో వీరవల్లిలో తీవ్ర విషాదం అలుముకుంది. ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి వచ్చి రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో చోడ వరం, విజయరామరాజుపేట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బుచ్చెయ్యపేట ఎస్ఐ డి. ఈశ్వరరావు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వీరవల్లి అగ్రహారంలో విషాదఛాయలు

మాడుగుల రూరల్: ఇద్దరు యువకులు మరణించడంతో వీరవల్లి అగ్రహారంలో విషాదం నెలకొంది. మృతుడు విస్సారపు గణేశ్ అప్పలరాజుపురంలో దాబా నిర్వహిస్తున్నాడు. భార్య గ్రామ వలంటీరు. ఇతనికి తొమ్మిది మాసాల కుమారుడు ఉన్నాడు. గురువారం గణేశ్ పెళ్లిరోజు. మరో మృతుడు శీలం మధు వడ్డాదిలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

క్లుప్తంగా

ఫాగ్ కెనాన్ వాహనాల ప్రారంభం



జెండా ఊపి వాహనాలు ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు

విశాఖ సిటీ: కాలుష్య నివారణకు విశాఖ పోర్టు అథారిటీ పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఫాగ్ కెనాన్లను అమర్చిన రెండు వాహనాలను పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు శుక్రవారం పోర్టు పరిపాలన భవనం ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత సాగర్–గ్రీన్ పోర్టు చర్యల్లో భాగంగా ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. పోర్టులోనే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాలను సైతం పరిశుభ్రంగా ఉంచేందుకు పోర్టు కట్టుబడి ఉందని తెలిపారు. ఫాగ్ కెనాన్లను అమర్చిన ఒక్కో వాహనం కోసం పోర్టు రూ.46 లక్షలు వెచ్చిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి టి.వేణు గోపాల్, ఇతర విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మోదీది ప్రచార ఆర్భాటమే'

బీచ్‌రోడ్డు : పేదలకు, అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం దేశ ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి శశి థరూర్ పేర్కొన్నారు. విశాఖకు కాంగ్రెస్ పార్టీ తరుపున స్టార్ క్యాంపెయినర్ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ మోదీ పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. ప్రచార ఆర్భాటమే తప్ప మోదీ చేసిన అభివృద్ధి ఏం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు వజ్జిపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ మతం పేరుతో రాజకీయం చేస్తోందన్నారు. విశాఖ ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి పాల్గొన్నారు.

సుందర పట్నం



- మారిన నర్సీపట్నం రూపురేఖలు
- వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు
- మెయిన్ రోడ్డు సుందరీకరణ
- రూ.2.20 కోట్లతో అర్బన్ హెల్త్‌సెంటర్లు నిర్మాణం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు

మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన నర్సీపట్నం గత టీడీపీ ప్రభుత్వంలో నిరాదరణకు గురైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఐదేళ్ల కాలంలో నర్సీపట్నం మున్సిపాలిటీ అభివృద్ధిలో దూసుకెళ్తోంది. టీడీపీ ప్రభుత్వంలో ఆరుసార్లు మంత్రిగా పనిచేసిన అయ్యన్నపాత్రుడు మున్సిపాలిటీ అభివృద్ధిని గాలికి వదిలేసారు. మొదటిసారి ఎమ్మెల్యే అయిన పెట్ల ఉమాశంకర్ గణేష్ మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణాన్ని మోడల్‌గా తీర్చిదిద్దమే లక్ష్యంగా దశబ్ధాల కాలం నాటి పనులకు శ్రీకారం చుట్టి మున్సిపాలిటీలో తనదైన ముద్ర వేసుకున్నారు.

నర్సీపట్నం : మున్సిపాలిటీలో 28 వార్డులు ఉన్నాయి. ఈ వార్డుల్లో 75 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెరవేరడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరహానదిపై వంతెన ఉన్నప్పటికీ అనుసంధానం రహదారి లేక లింగాపురం గిరిజనులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడేవారు. ఎమ్మెల్యే గణేష్ చొరవ తీసుకుని రైతు వద్ద నుంచి భూమి కొనుగోలు చేసి కనెక్టివిటీ రోడ్డు నిర్మించి రహదారి కష్టాలు తీర్చారు.

రహదారులకు మహర్దశ



వెంకటేశ్వరస్వామి ఆలయం నుండి పెదబొడ్డేపల్లి వరకు వేసిన ప్రత్యామ్నాయ రోడ్డు

మున్సిపాలిటీలో 28 వార్డుల్లో గత ఐదేళ్లలో సుమారు రూ.22 కోట్లతో వార్డుల్లో సీసీ రోడ్లు, పక్కా డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టారు. గ్రావెల్ రోడ్లు సీసీ రోడ్లుగా మార్పు చెందడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిగేలంటున్న మెయిన్‌రోడ్డు

దశబ్ద కాలంగా పట్టణ ప్రజలను పట్టిపీడిస్తున్న మెయిన్‌రోడ్డు, ప్రత్యామ్నాయ రోడ్ల విస్తరణకు ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ఈ రోడ్ల విస్తరణ పనులకు రూ.16 కోట్లు మంజూరు చేసింది. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. కొంత మంది భవన యజమానులతో అయ్యన్నపాత్రుడు కోర్టులో కేసులు వేయించి రోడ్డు విస్తరణకు అడ్డుపడ్డారు. అయినప్పటికీ ఎమ్మెల్యే వెనకకు తగ్గలేదు. అభ్యంతరం లేని అబిద్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వంద అడుగుల మేర మెయిన్ రోడ్డును విస్తరించి, సెంట్రల్ లైటింగ్‌తో పాటు డివైండర్‌ను మొక్కలతో సుందరీకరించారు. ప్రత్యామ్నాయ రోడ్డు నర్సీపట్నం వెంకటేశ్వరస్వామి ఆలయం నుండి పెదబొడ్డేపల్లి వరకు విస్తరించారు. ఈ రోడ్డు విస్తరణ పనులు 75 శాతం పూర్తయ్యాయి. ఈ రెండు రోడ్ల విస్తరణతో పట్టణం కొత్త కలను సంతరించుకుంది.

పాఠశాలలకు సౌకర్యాలు



నాడు-నేడులో ఆధునికీరించిన జెడ్పీ హైస్కూల్

నాడు-నేడు పథకంతో మున్సిపాలిటీలో 10 పాఠశాలలు, రెండు కళాశాలల రూపురేఖలు మారాయి. రూ.7 కోట్లతో అదనపు భవనాల నిర్మాణంతో రన్నింగ్ వాటర్, విద్యుత్ సదుపాయం, బాత్‌రూమ్‌లు, పెయింటింగ్, టైల్స్, ఫ్యాన్లు, మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు.

రూ.166.85 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు

పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేసింది. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.166.85 కోట్ల మంజూరు చేసింది. ఏడాది క్రితం ఈ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీలో పైపులైన్ల నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. మూడు రిజర్వాయర్ పనులు చేపట్టారు. ఈ తాగునీటి ప్రాజెక్టు అందుబాటులోకి రానుండడంతో ప్రజల దాహార్తి తీరనుంది.

చెంతనే ప్రభుత్వ వైద్యం...

మున్సిపాలిటీ పరిధి నర్సీపట్నం, బలిఘట్టం, పెదబొడ్డేపల్లి ప్రాంతాల్లో రూ.2.20 కోట్లతో ప్రభుత్వం డా.వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్మించింది. ఇటీవల వీటిని స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రారంభోత్సవం చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒక్కో అర్బన్ సెంటర్‌లో వైద్యుడితో పాటు ఇద్దరు స్టాఫ్ నర్సులు, కంప్యూటర్ ఆపరేటర్, ల్యాబ్ టెక్నిషియన్, ఫార్మసిస్టు వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అర్బన్‌హెల్త్ సెంటర్లలో 64 రక్తపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారు. నేషనల్ హెల్త్ మిషన్ సహకారంతో రూ.106 లక్షలతో జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చారు. రూ.9 కోట్లతో ఏరియా ఆస్పత్రిలో అదనపు భవనాలను నిర్మించారు. నవజాత శిశువులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు రూ.10 లక్షలతో పది బెడ్లతో కూడిన ఎస్ఎన్‌సీయూ (స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్)ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది.



ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఎస్ఎన్‌సీయూ



పేదల సొంతింటి కల సాకారం



పేదలకు పంపిణీ చేసిన టిడ్కో గృహాలు

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గృహ యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. లక్షలు విలువ చేసే భూమి సేకరించి 1665 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.1.85 లక్షలు మంజూరుతో కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయాలు వెచ్చించారు. అలాగే బయపురెడ్డిపాలెం, బలిఘట్టం ప్రాంతాల్లో జీ ప్లస్–3 టిడ్కో గృహాల నిర్మాణం జరిగింది. మొత్తం 1822 గృహాలు. వీటిలో ఇప్పటికే రూ.1కే 300 గృహాలను ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ అందజేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మత్స్యకార కుటుంబాలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్.



పార్టీలో చేరిన మాజీ ఎంపీటీసీ వెంకటరమణ

నర్సీపట్నం: గొలుగొండ మండలం పాతమల్లంపేట పంచాయతీ శివారు గదవపాలెంకు చెందిన పది టీడీపీ మత్స్యకార కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పక్క జగ్గయ్య, నక్క రమణ, అప్పారావు, చినఅప్పారావు, పడాల కామయ్య, చిన్నఅచ్చన్న, సత్తిబాబు, సతీష్, సత్యానందతోపాటు పలువురు పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మత్స్యకార కుటుంబాలకు అండగా ఉంటానని, ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

టీడీపీ మాజీ ఎంపీటీసీ సహా 20 కుటుంబాలు..

గొలుగొండ మండలం అమ్మపేట గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ గొర్లి వెంకటరమణ 20 కుటుంబాలతో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో కష్టపడి పని చేసినా తగిన గుర్తింపు లేకనే వైఎస్సార్‌సీపీలో చేరానని ఎంపీటీసీ పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు రుత్తల యర్రాపాత్రుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నల్లబెల్లి శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం



ఇదే మన గుర్తు: పాయకరావుపేటలో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని ఓటరుకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు



ఫ్యాన్‌కే మద్దతు: కె.జె.పురంలో ముస్లింలతో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ



వర్షాన్ని లెక్క చేయకుండా.. : రోలుగుంటలో ప్రసంగిస్తున్న చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ

వైఎస్సార్‌సీపీకే మాదిగల మద్దతు

- రాష్ట్ర మాదిగ మహాసేన అధ్యక్షుడు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్



యలమంచిలిలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న రాష్ట్ర మాదిగ మహాసేన నాయకులు

యలమంచిలి రూరల్: బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న వైఎస్సార్‌సీపీకే తమ మద్దతు అని రాష్ట్ర మాదిగ మహాసేన అధ్యక్షుడు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా శుక్రవారం యలమంచిలి అరుంధతి ఎస్సీ కాలనీలో మాదిగ సామాజికవర్గంతో మాదిగ మహాసేన నేతలు సమావేశమయ్యారు. మాదిగ సామాజికవర్గానికి ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను ప్రదర్శించారు. మాదిగల సంక్షేమానికి సీఎం జగనన్న ఎంతో కృషి చేశారని మాదిగ మహాసేన నాయకులు ఈ సందర్భంగా చెప్పారు. ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి మాదిగలంతా వైఎస్సార్‌సీపీకే ఓటు వేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పల్లెలో మాదిగలంతా వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇస్తున్నారని మాదిగ మహాసేన నేతలు పెదపూడి వెంకటరమణ, చైతన్య, సూరిబాబు, దిగుమర్తి నానాజీ ఈ సందర్భంగా చెప్పారు. కోడి గణేష్, గుంటూరు జిల్లా మాదిగ మహాసేన నేత కూచిపూడి గోపి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షుడు కొదమల వినయ్, ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చిలుక రమేష్, పల్నాడు జిల్లా కార్యదర్శి దొప్పలపూడి ఎలమంద పాల్గొన్నారు.

బాలుడి ప్రాణం కాపాడిన కేజీహెచ్ వైద్యులు

- పూర్తిగా కోలుకుని డిశ్చార్జి అయిన బాలుడు



కోలుకున్న దిలీప్‌కుమార్‌ను అభినందిస్తున్న పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి

మహారాణిపేట : తీవ్ర అనారోగ్యంతో కేజీహెచ్ పిల్లల వార్డులో చేరిన బాలుడికి చక్కటి చికిత్స అందించిన వైద్యులు శుక్రవారం అతన్ని డిశ్చార్జి చేశారు. ఏప్రిల్ 10న విజయనగరానికి చెందిన దిలీప్ కుమార్ (10) తీవ్ర జ్వరం, కడుపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి పలు సమస్యలతో నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. అనంతరం అతన్ని మెరింత మెరుగైన ఆరోగ్యం కోసం అక్కడి నుంచి కేజీహెచ్ పిల్లల వార్డుకు తరలించారు. కేజీహెచ్ పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బీవీ చక్రవర్తి ఆధ్వర్యంలో దిలీప్ కుమార్‌కు వైద్య సేవలు అందించారు. ఇటీవల కేజీహెచ్ పిల్లల వార్డులో ఆధునికీకరించిన పీఐసీయూలో బాలుడికి వైద్య సేవలందాయి. ఆధునికీకరణలో భాగంగా ఈ యూనిట్‌కు 6 వెంటిలేటర్లు, 3 హెచ్ఎఫ్ఎన్‌సీలు, 10 సెంట్రల్ ఎయిర్ కంప్రెషర్లు, 10 పడకలు ఏర్పాటు చేసిన సంగతి విదితమే. ఇటువంటి సౌకర్యాల వల్ల చక్కటి వైద్య సేవలంది బాలుడు బతికి బయట పడ్డాడు. ఈ బాలుడితో పాటు వార్డులో చందన శ్రీ,ఆకాంక్ష రాజు, నాయక్, పెంటమ్మ తదితర చిన్నారులు కోలుకుంటున్నారు. చక్కటి వైద్య సేవలు అందించగలుగుతున్నామని పిల్లల వార్డు విభాగాధిపతి చక్రవర్తి తెలిపారు.

ముగ్గురు బాలురు పరార్

- వారిలో ఒకరు తండ్రికి అప్పగింత



పరారై దొరికిన అనిల్‌కుమార్



తోట సంతోష్



కొమ్ము రవి

చోడవరం రూరల్: పట్టణ శివారు చుక్కావారి కళ్లాల నుంచి ముగ్గురు బాలురు పరారయ్యారు. వారిలో ఒకరిని పోలీసులు దొరబుచ్చుకోగా, మిగిలిన ఇద్దరు ఆ సమయంలో పారిపోయారు. చోడవరం ఎస్ఐ శేఖరం వివరాల ప్రకారం... తోట సంతోష్ (12), గంటా అనిల్‌కుమార్ (6), కొమ్ము రవి (9) గురువారం తమ ఇళ్ల నుంచి మాయమయ్యారు. వారి ఆచూకీ కోసం అన్ని చోట్ల వెతికిన తల్లిదండ్రులు, బంధువులు శుక్రవారం చోడవరం పోలీసులను ఆశ్రయించారు. ముగ్గురు బాలురు కనిపించకుండాపోయిన ఉదంతాన్ని పలు సోషల్ మాధ్యమాల్లో ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో కొమ్ము సత్యవతి మనవడు రవి పట్టణ శివారు నరసయ్యపేటలోని షోలాపురి అమ్మవారి గుడి వేపచెట్టు వద్ద ఉన్నట్టు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న చోడవరం పోలీసులు సదరు బాలుడ్ని అదుపులోకి తీసుకుని అతని తండ్రి బాలకృష్ణకు అప్పగించారు. మిగిలిన ఇద్దరు బాలురు అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయారు. వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ వివరాల మేరకు... మండలంలో జాతీయ రహదారి శారదానది బ్రిడ్జి సమీపంలో అన్నపూర్ణ ఫంక్షన్ హాలు ఎదురుగా రహదారిలో విశాఖ నుంచి యలమంచిలి వైపు వెళ్తున్న వాహనం ఢీ కొనడంతో అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

క్లుప్తంగా

వైభవంగా సామూహిక గౌరీ వ్రతాలు



లలితా సహ్రసనామ పారాయణ చేస్తున్న మహిళలు

కశింకోట: స్థానిక శివాలయంలోని సర్వమంగళాంబ సన్నిధిలో శుక్రవారం మహిళలు సామూహిక గౌరీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారిని పూలమాలలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. అర్చకుడు వి.కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. లలితా సహస్ర నామ పారాయణ చేశారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కశింకోటలో పోలీసుల మార్చ్‌పాస్ట్



కశింకోటలో మార్చ్ పాస్ట్ నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్, పోలీసు సిబ్బంది

కశింకోట: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి భద్రత కల్పిస్తామని ప్రజలకు భరోసా ఇస్తూ సీఐఎస్ఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీసులు శుక్రవారం మార్చ్ పాస్టు నిర్వహించారు. కశింకోట, తాళ్లపాలెం, వెదురుపర్తి, పరవాడపాలెం గ్రామాల్లో సిబ్బంది కవాతు జరిపారు. ప్రజలు ఆసక్తిగా దీన్ని వీక్షించారు. సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేవీ ప్రహరీ పనుల అడ్డగింత

రాంబిల్లి: పెదకలవలాపల్లి వద్ద జరుగుతున్న నేవీ ప్రహరీ నిర్మాణ పనులను శుక్రవారం పలువురు రైతులు అడ్డుకున్నారు. తమ పశువుల పాకలకు వెళ్లేందుకు దారి లేకుండా ప్రహరీని నిర్మించడం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ లక్ష్మణరావు రైతులతో మాట్లాడారు. తాత్కాలికంగా దారి ఉండేలా చర్యలు తీసుకుంటామని, ఆ తర్వాత ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి అక్కడ పాకలు ఏర్పాటు చేసుకునేలా చేస్తామని హామీ ఇచ్చారు.

అనకాపల్లి సినిమాలు

ప్రసన్న వదనం	: రాజా
లక్ష్మీకటాక్షం	: సత్యనారాయణస్క్రీన్-1
కింగ్‌డమ్‌ప్లానెట్ అఫ్ ఏపీఈఏస్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటే అడక్కు	: పర్తిసాయి
ప్రతినిధి	: వెంకటేశ్వర
రత్నం	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 1,183 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,360	4,840
మొదటి రకం	3,890	4,750
రెండో రకం	3,800	4,470
మూడో రకం	3,400	3,730

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-15 యూనిట్లు, బి నెగిటివ్-1 యూనిట్, ఒ పాజిటివ్-16 యూనిట్లు, ఒ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706) ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 412 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 361 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం



సమావేశానికి హాజరైన ప్రజలు



నాగులాపల్లి బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ఖాయమని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు చెప్పారు. ఐదేళ్ల కాలంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగించారన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని నాగులాపల్లిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి అమలు చేసిన నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలు ఏకమైనా ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారన్నారు. చంద్రబాబు అండ్‌ కో కుతంత్రాలు,కుట్రలను గుర్తుంచుకుని వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు. ఎంపీగా బూడి ముత్యాల నాయుడును, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. సర్పంచ్ జామి చినమ్మలు, వైస్ ఎంపీపీ చిందాడ దేవి,వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జామి రాజు, ఎంపీపీ మల్ల జయలక్ష్మి,రాష్ట్ర బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ మళ్ల కాశీసురేష్, పార్టీ నేతలు ముచ్చకర్ల సత్యనారాయణ, దొడ్డి బుజ్జి, బొడ్డేడ బుజ్జి, మల్ల సూరప్పారావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

రాంబిల్లి: జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. మండలంలో లాలంకోడూరు, రాజుకోడూరు, సంతపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అవినీతికి తావులేకుండా సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల, ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మవద్దని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ముత్యాల నాయుడునుగెలిపించాలనిఅభ్యర్థించారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి...

గోవిందపాలెం గ్రామంలో టీడీపీకి చెందిన ఈగల వెంకటరావు, పొన్నాడ ప్రకాష్‌తో పాటు పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే రమణమూర్తి రాజు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచార హోరు



మునగపాక ఇందిరమ్మ కాలనీలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ



మల్లవరంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న రాష్ట్ర బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ చందు

మునగపాక: మండలంలో పలు గ్రామాల్లో ప్రచారం జోరుగా సాగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో శుక్రవారం భారీ ఊరేగింపు, ర్యాలీ నిర్వహించారు. పార్టీ శ్రేణులు,అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నేత షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. పేదలకు,పెత్తందారులకు మధ్య ఈఎన్నికల యుద్ధం జరుగుతోందని, ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. చంద్రబాబు మోసాలను తిప్పికొట్టాలని తెలిపారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి,ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పార్టీ నేతలు కాండ్రేగుల సూర్యనారాయణ, మళ్ల ఈశ్వరరావు,దొడ్డి కోటేశ్వరరావు,కాండ్రేగుల శేషు,మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ గ్రామంలోని అన్ని వీధులగుండా సాగింది.

మునగపాక: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. మునగపాక ఇందిరమ్మ కాలనీలో గురువారం రాత్రి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈవీఎంపై అవగాహన కల్పించారు. అనకాపల్లి ఎంపీ, యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి.రమణమూర్తిరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ నాయకులు కోనపల్లి రామ్మోహనరావు,ఆడారి వెంకట అప్పారావు,కొణతాల సంతోష్‌కుమార్, టెక్కలి గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు. మల్లవరంలో రాష్ట్ర బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం వల్ల ప్రతి పేద కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. మూలపేట పంచాయతీ శివారు గంగాదేవిపేటలో గురువారం రాత్రి తోటాడ ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి,ఉప సర్పంచ్ మొల్లేటి దేవీ తదితరులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.



గవర్ల అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నేత ఇస్మాయిల్



గంగాదేవిపేటలో ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ వెంకటలక్ష్మి,ఉప సర్పంచ్ దేవి

అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీని గెలిపించండి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ సత్యవతి



టీడీపీ, జనసేనకి చెందిన యువకులకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలను చూసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ బి.వి. సత్యవతి కోరారు. మండలంలోని తుమ్మపాలలో శుక్రవారం రాత్రి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ మరోసారి ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్‌గుర్తుపై వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు 20మంది యువకులు జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు, వీరికి మలసాల భరత్‌కుమార్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామ సర్పంచ్ తట్టాపెంటయ్యనాయుడు, మండలపార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ రాజశేఖర్ తెలిపారు. జంగిల్ క్లియరెన్స్ కారణంగా కొత్తూరు,మూలకొత్తూరు, మామిడివాడ,గోకివాడ,రాంబిల్లి,మూలజంప,లాలంకోడూరు,వెల్చూరు, రాజుకోడూరు, వాడనర్సాపురం, కొత్తపేట,కొత్తపట్నం,గోవిందపాలెంలలో ఉదయం10 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు విద్యుత్‌సరఫరా ఉండదన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పాపారావు



సమావేశానికి హాజరైన బీఎల్‌వోలు

మునగపాక: పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ పాపారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు వచ్చేవారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. బీఎల్‌వోలు కేంద్రాల వద్ద సమయపాలన పాటించాలని తెలిపారు. ఎంపీడీవో మన్మధరావు,డీటీ వినయ్‌కుమార్,ఈవోఆర్డీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సకల పాపహరణం.. నిజరూప దర్శనం

- పురాతన లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో అపురూప ఘట్టం
- తిలకించి పరవశించిన భక్తజనం



కశింకోటలో వరాహ లక్ష్మీ నృసింహస్వామి నిజరూపం

కశింకోట : స్థానికంగా ప్రసిద్ధి చెందిన వరాహ లక్ష్మీ నృసింహస్వామి నిజ రూప దర్శనం భక్తులకు కనువిందు చేసి భక్తి పారవశ్యాన్ని నింపింది. వైశాఖ శుద్ధ తదియను పురస్కరించుకుని పురాతన లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో శుక్రవారం చందనోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సింహాచలం తరహాలోనే ఇక్కడా లక్ష్మీ నృసింహస్వామి నిత్య చందన రూపానికి వేద మంత్రాల నడుమ వేకువ జామున చందనం తొలగించారు. దీంతో స్వామి నిజ రూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. పంచామృతాలు, చెరకు రసాలు, పసుపు, కుంకుమ, చందనాలతో వేర్వేరుగా శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. మామిడి, అరటి తదితర పండ్లు సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం స్వామి నిజ రూపానికి యథావిధిగా వేద మంత్రోచ్ఛరణతో చందనం పూశారు. భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు అత్తిలి కోదండ పాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా నుంచి వేద పండితులు వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు.



పొక్లెయిన్ తో డ్రైనేజీలో చెత్తను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

డ్రైనేజీలో పూడిక తొలగింపు

అనకాపల్లి: పట్టణ పరిధిలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులు నిర్వహిస్తున్నట్టు జెడ్సీ ఓ.అయ్యప్పనాయుడు తెలిపారు. స్థానిక రింగ్‌రోడులో డ్రైనేజీ నుంచి చెత్తను తొలగించినట్టు తెలిపారు. ప్రతి ఏడాది వేసవిలో పట్టణ పరిధిలో డ్రైనేజీల నుంచి దశలవారీగా పూడిక తొలగిస్తామని చెప్పారు. వచ్చేనెల 10వ తేదీ వరకూ పట్టణంలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీలో చెత్తను తొలగిస్తామని ఆయన తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా కుమార్



నూతన కమిటీని సత్కరిస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎం.జె.వి.ఎస్.కుమార్ ఎన్నికయ్యారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా దుర్గారావు, ఉపాధ్యక్షునిగా రోజా, సహాయ కార్యదర్శిగా తులసి, కోశాధికారిగా సందీప్, లైబ్రేరియన్‌గా జగపతి, మహిళా రిప్రజెంటేటివ్‌గా కుసుమ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మల్లేష్, రామచంద్రరావు, నరసింహం, తేజ, లీల ఎన్నికయ్యారు. ఈ కమిటీ ఏడాది పాటు కొనసాగుతుందని ఎన్నికల అధికారి సాయిరాం ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజశేఖర్, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం



మజ్జిగ పంపిణీ చేస్తున్న గరికి వెంకటరావు, మద్దాల చిరంజీవి రమణ

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయం వద్ద ఆలయ కమిటీ ప్రతినిధి గరికి వెంకటరావు, మద్దాల చిరంజీవి రమణలు మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజుకు 500 మందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గతంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో ముఖ్యపట్టణమైనా ఏళ్ల పాటు నిరాదరణకు గురైంది...ఎక్కడ చూసినా అసౌకర్యాలు రాజ్యమేలేవి... ప్రజలు పడుతున్న అవస్థలే కనిపించేవి.. జాతీయ రహదారి నుంచి అనకాపల్లి పట్టణానికి రావాలంటే పూడిమడక రహదారి, జలగలమదుం జంక్షన్, మండలంలో ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ ప్రధాన రహదారుల్లో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించేవారు. అస్తవ్యస్తంగా ఉండే ఆ రోడ్లపై ప్రయాణించేటప్పుడు బస్సులు, ఇతర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతుండేవి. దీంతో చాలా మంది మృత్యువాత పడ్డారు. మరికొంతమంది క్షతగాత్రులు జీవశ్చవాలుగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అధికార పగ్గాలు చేపట్టిన తరువాత అనకాపల్లి పట్టణంతో పాటు నియోజకవర్గం అభివృద్ధికి చిరునామాగా మారింది. దీర్ఘకాలిక సమస్యలెన్నో పరిష్కారమయ్యాయి. అనకాపల్లి నియోజకవర్గ ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయి. గత ఐదేళ్లుగా నియోజకవర్గం ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది. – అనకాపల్లి



'నవరత్నాల' వెలుగులు

నవరత్నాలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల జీవితాలలో వెలుగులు నింపింది. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసింది. విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేసి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు నిర్వహించింది. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేసింది. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించడంతో వారు అన్ని విధాలుగా అభివృద్ధి సాధించారు. నియోజకవర్గంలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులు పొందిన ప్రయోజనం వివరాలు


జలగలమదుం నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకు నిర్మించిన రోడ్డు

పథకం	లబ్ధిదారులు	నిధుల (రూ.లక్షల్లో)
పెన్షన్‌కానుక	2,68,138	78.06
జగనన్న అమ్మ ఒడి	1,68,873	202.3
చేయూత	1,15,101	582.85
ఆసరా	3,33,626	997.19
రైతు భరోసా	41,011	28.56
గృహనిర్మాణం	5,548	10.6
సున్నావడ్డీ	3,88,297	118.77
కాపునేస్తం	25,201	46.87
ఉచిత పంటల బీమా	8,962	108.00
విద్యాదీవెన	16,479	9.87
వసతి దీవెన	14,523	6.08
నేతన్న నేస్తం	343	2.87
ఈబీసీ నేస్తం	5,5112	3.04
వైఎస్సార్ బీమా	4,71,558	9.87
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	6,453	1.92
వాహనమిత్ర	4,362	2.01
సున్నా వడ్డీ పంట రుణాలు	7,236	0.87
జగనన్న చేదోడు	4,982	63.2
ఆరోగ్య శ్రీ	2,569	156.25
తెల్లరేషన్‌కార్డుదారులకు కోవిడ్ సాయం	70,484	85.74
ఆరోగ్య ఆసరా	23,576	42.11
లా నేస్తం	84	4.20
కల్యాణ మస్తు, షాదితోఫా	2,886	17.27
అర్చకులు/పాస్టర్లకు సాయం	183	3.93
విదేశీ విద్యా దీవెన	65	3.12
జగనన్న తోడు	1,30,370	132.47
సంపూర్ణ పోషణ	26,569	3.84
గోరుముద్ద	3,632	89
విద్యాకానుక	79,937	4.23

అభివృద్ధి C/o అనకాపల్లి

సాక్షి ఫోకస్ / sakshi focus

గత పాలకుల నిర్లక్ష్యంగా కారణంగా కనీస స్థాయిలో కూడా అభివృద్ధికి నోచుకోని అనకాపల్లి నియోజకవర్గం గడచిన ఐదేళ్లలో ప్రగతి పథంలో పరుగులుతీస్తోంది. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. దీర్ఘకాలిక సమస్యలెన్నో పరిష్కారమయ్యాయి. ప్రభుత్వ భవనాలు, బడులు కార్పొరేట్ హంగులతో చూడముచ్చట గొలుపుతున్నాయి. గతంలో కనీస సౌకర్యాలు కూడా నోచుకోని ఆస్పత్రుల్లో ఇప్పుడు అధునాతన వైద్య పరికరాలతో వైద్య సేవలందిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చి, ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వం సకల సేవలు అందిస్తోంది. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ పారదర్శకపాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల కాలంలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా 4,10,382 మంది లబ్ధిదారులకు సుమారు రూ.1500 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది. కోట్ల రూపాయలతో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనులు చరిత్రలో నిలిచిపోతాయి. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన గుడివాడ అమర్‌నాథ్.. మంత్రిగా పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. చాలా ఏళ్ల పాటు నియోజకవర్గ ప్రజలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థికే పట్టం కట్టినప్పటికీ ఎటువంటి అభివృద్ధి జరగలేదు.


సత్యనారాయణ పురం వద్ద నిర్మించిన టిడ్కో గృహాలు

అద్దంలా రోడ్లు.. అందంగా పార్కులు

నియోజకవర్గంలో అన్ని రహదారులను సుమారు రూ.513 కోట్లతో అభివృద్ధి చేశారు. నియోజకవర్గంలో జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ గ్రామీణ రహదారులను అభివృద్ధి చేశారు. మండలంలో మారేడుపూడి, చిన్నముషిడివాడ, కుంచంగి, కూండ్రం, వేదురుపర్తి, తేగాడ, బయ్యవారం గేటు, నర్సింగబిల్లి, సోమవారం, మామిడిపాలెం, రాజుపాలెం, వల్లూరులలో వీధి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. అనకాపల్లి పట్టణ పరిధిలో పార్కులు, వాకింగ్‌ట్రాక్‌లు, వ్యాయామశాలలు రూ. 3 కోట్లు, శ్మశాన వాటికలను రూ.2 కోట్లతో అభివృద్ధి చేశారు.


మారేడుపూడి నుంచి నిర్మించిన రహదారి

ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం

ఎన్టీఆర్ వైద్యాలయాన్ని రూ.ఆరు కోట్లతో అభివృద్ధి చేశారు. ఆక్సిజన్ ప్లాంట్, సీటీ స్కాన్ ఏర్పాటు చేయడంతో పాటు రోగులకు పలు సదుపాయాలు కల్పించారు. ఆస్పత్రి ఎదురుగా క్రిటికల్ కేర్ ఆస్పత్రిని రూ.6 కోట్లతో నిర్మిస్తున్నారు. తుమ్మపాల, తగరంపూడి, కశింకోట, తాళ్లపాలెం పీహెచ్‌సీలను రూ.1.70 కోట్లతో అభివృద్ధి చేసి రోగులకు సదుపాయాలను మెరుగుపర్చారు.

పర్యాటక కేంద్రంగా బొజ్జన్న కొండ ...

అనకాపల్లి మండలం శంకరం పంచాయతీ పరిధిలో బొజ్జన్నకొండను పర్యాటక కేంద్రంగా సుమారుగా రూ.10 కోట్లతో అభివృద్ధి చేశారు. జాతీయ రహదారి నుంచి కొండకు వెళ్లే రోడ్డును నిర్మించారు. కొండ చుట్టూ లైటింగ్‌ను ఏర్పాటు చేయడంతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొండను సందర్శించే వారి సంఖ్య పెరిగింది.

73 సచివాలయాలు... 42 ఆర్బీకేలు


సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాటలు వేసింది. సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చి గ్రామంలోనే 12 ప్రభుత్వ శాఖల సిబ్బందిని నియమించింది. నియోజకవర్గంలో 73 సచివాలయాలను, 42 ఆర్బీకేలను ఏర్పాటుచేసి సేవలందిస్తోంది.

తాగునీరు

జీవీఎంసీ పరిధి అగనంపూడి నుంచి అనకాపల్లి పట్టణానికి రూ.35 కోట్లతో తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్‌ద్వారా ఇంటింటికీ కుళాయిలు మంజూరు చేశారు. గ్రామాల్లో రూ.110 కోట్లతో ట్యాంక్‌లు నిర్మించి తాగునీటి అందిస్తున్నారు.

పాఠశాలల అభివృద్ధి

నాడు-నేడు పథకం ద్వారా నియోజకవర్గంలో మొదటి, రెండో విడతల్లో 252 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయించారు. నూతన భవనాలు, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, రన్నింగ్‌వాటర్, తాగునీరు, మినరల్ వాటర్, విద్యార్థుల కోసం డిజిటల్‌తరగతి గదులు, బెంచీలు సమకూర్చారు. పాఠశాలల భవనాలను రంగులతో తీర్చి దిద్ది రూపురేఖలు మార్చారు.


సీతానగరంలో వాటర్ ట్యాంక్

అందాల లోగిళ్లు

ప్రతి పేదవాడికి సొంత గూడు ఉండాలని జగనన్న ప్రభుత్వం సంకల్పించింది. ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో జగనన్న గృహాలు, టిడ్కో గృహాలను పెద్ద ఎత్తున అందజేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ పాలనలో పేదవాడి సొంతింటి కల నెరవేరడమే కాకుండా సొంత చిరునామా ఏర్పడింది. నియోజకవర్గంలో సుమారు 11,891 మంది లబ్ధిదారులకు సుమారు రూ.250 కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని అందజేశారు. పట్టణ పరిధిలో లబ్ధిదారులకు సెంటు స్థలం, గ్రామీణ ప్రజలకు సెంటున్నర ప్రభుత్వ స్థలం ఇచ్చారు. ఒక్కో గృహానికి రూ.1.80 లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. 2,362 మందికి టిడ్కో గృహాలు అందజేశారు. ఆ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి నిల్

టీడీపీ హయాంలో నియోజకవర్గంలో కనీసస్థాయిలో కూడా అభివృద్ధి పనులు జరగకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు.తుమ్మపాల సుగర్‌ఫ్యాక్టరీ తెరిపించి, కార్మికుల బకాయిలు చెల్లిస్తామని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీని నేరవేర్చలేకపోయారు. పూడిమడక-ఆర్టీసీ కాంప్లెక్స్‌రహదారి,జలగల మధుం జంక్షన్ నుంచి సుంకరమెట్ట వరకూ రహదారిని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించారు.

ప్రజల ముంగిటకే పాలన

సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి గ్రామంలోనే 12 ప్రభుత్వ శాఖల సిబ్బందిని నియమించారు. సమస్యల పరిష్కారం, ధ్రువీకరణపత్రాల కోసం మండల కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా గ్రామాల్లోనే అన్ని పనులు జరిగేలా చర్యలు చేపట్టారు. పింఛను తీసుకోవడానికి అవ్వాతాతలు పడుతున్న ఇబ్బందులు పరిష్కరించేందుకు వలంటీరు వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చి, ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను ఇంటి వద్ద ఇచ్చే కార్యక్రమం చేపట్టారు.

పూర్తిస్థాయిలో అభివృద్ధి



అనకాపల్లి నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో కనీవినీ ఎరగని అభివృద్ధి జరిగింది. డీబీటీ, నాన్ డీబీటీ పథకాల కింద సుమారు రూ.1500 కోట్లు ఖర్చు చేయడం గొప్ప విషయం. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు సమాన స్థాయిలో అభివృద్ధి చెందాయి. ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయి కాబట్టే ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లి ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైతే ఈ అభివృద్ధి జోరును కొనసాగించడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తాను.

– మలసాల భరత్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి

అందాలపల్లిగా అభివృద్ధి చేశాం



అనకాపల్లిని అందాలపల్లిగా అభివృద్ధి చేయడానికి కృషిచేశాం. రహదారులు, సెంటర్ లైటింగ్, డివైడర్లు ఏర్పాటు చేశాం. పచ్చదనం పెంచేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాం. అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడిన తరువాత భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాం. ఎన్టీర్ ఆస్పత్రిని రూ.6 కోట్లతో అభివృద్ధి చేసి సేవలను విస్తృతం పరిచాం. పట్టణంలోనే కాకుండా నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్, తారురోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనాలు, విద్యార్థుల వసతిగృహాలు నిర్మించాం. చెరువులు అభివృద్ధిచేశాం. బొజ్జన్న కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేశాం. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలను చెల్లించాం. **– గుడివాడ అమర్‌నాథ్,** ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి

'రూపు'దిద్దుకున్న అభిమానం


చినబాబు

వైస్ ఎంపీపీ చినబాబు ఇంటిపై ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ధర్మశ్రీ బొమ్మలు

- మహానేత వైఎస్, సీఎం జగన్, ఎమ్మెల్యే ధర్మశ్రీ చిత్రాలతో ఇంటి అలంకరణ
- నేతలపై మక్కువను వినూత్నంగా వెల్లడిస్తున్న వైస్ ఎంపీపీ చినబాబు

బుచ్చెయ్యపేట: ఆయన టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చారు.. ఏదో రాజకీయ కారణాలతో కాకుండా మనసు నిండా అభిమానంతో వచ్చారు.. అక్కడ ఆత్మగౌరవం చంపుకొని పనిచేసేవారమని, వైఎస్సార్‌సీపీలో తనకు, తనలాంటి వారికి ఎంతో విలువ ఇస్తున్నారని చెబుతారాయన. అందుకే తన ఇంటిపై అభిమాన నేతల బొమ్మలు గీయించుకున్నారు. ఆయన పేరు గొంప చినబాబు. బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి గ్రామం. ప్రస్తుతం మండల వైస్ ఎంపీపీ. ఆయన 2018 వరకు టీడీపీలో క్రియాశీలక నేతగా పని చేశారు. టీడీపీకి కంచుకోటగా ఉండే ఈ గ్రామంలో చినబాబు ప్రజా సమస్యలపై తక్షణం స్పందించేవారు. టీడీపీలో జరుగుతున్న అవినీతి నచ్చక ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వ లక్షణాలకు ఆకర్షితుడై 2018 డిసెంబర్ 21వ తేదీన టీడీపీని వీడి తన అనుచరులు, కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీకి 400 ఓట్ల వరకు మెజారిటీ వచ్చే ఈ గ్రామంలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 119 ఓట్ల ఆధిక్యత వచ్చేలా చినబాబు కృషి చేశారు. తర్వాత జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించి వైస్ ఎంపీపీ పదవి చేపట్టారు. జగనన్న పాలనా విధానం నచ్చి తన ఇంటి చుట్టూ దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఫొటోలను పెయింట్ వేయించి తన అభిమానాన్ని చాటుకున్నారు.

'విశాఖ రాజధాని'కే ఓటు

- క్యాపిటల్‌కు అవసరమైన అన్ని హంగులూ ఉన్నాయి
- ఇన్ని పుష్కల వనరులు రాష్ట్రంలో మరెక్కడా లేవు
- ప్రఖ్యాత రాజధానులు తీర ప్రాంత చెంతనున్నవే..
- అమరావతి అభివృద్ధి చెందాలంటే మరో 30 ఏళ్లు
- జగన్ మళ్లీ సీఎం అయితేనే వైజాగ్ రాజధాని అవుతుంది
- ఉత్తరాంధ్రలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి

రచ్చబండ


విశాఖ శివాజీ పార్కులో రాజధానిపై తమ మనోగతాన్ని చర్చించుకుంటున్న నగర వాసులు

సాక్షి, విశాఖపట్నం: 'మన విశాఖపట్నానికి ఏం తక్కువ? ప్రకృతి రమణీయతలోనా? సహజ సౌందర్యంలోనా? పర్యాటక, పారిశ్రామిక రంగాల్లోనా? ఆర్థిక వనరుల్లోనా? కనెక్టివిటీలోనా? అందరినీ అక్కున చేర్చుకోవడం లోనా? ఇలా చెప్పుకుంటూ పోతే ఎందులోనూ తీసిపోదు మన వైజాగ్! అలాంటి సకల హంగులూ ఉన్న విశాఖ మహా నగరాన్ని కాదని.. ఏ వనరులు, సదుపాయాలూ లేని అమరావతిని రాజధాని చేస్తారా? వైజాగ్ వాసులుగా మనందరం ఇక్కడ రాజధానికే ఓటేయ్యాలి. జగన్ సీఎం అయితేనే విశాఖ రాజధాని అవుతుంది. విశాఖ సహా ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంత వాసులకు మేలు జరుగుతుంది.. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ విశాఖ రాజధాని అయ్యే అవకాశం రాదు. చంద్రబాబు ఈ నగర వనరులను దోచుకోవడమే తప్ప ఎప్పటికీ రాజధానిని కానీయరు' అంటూ విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, రిటైర్డు అధికారులు, వ్యాపారులు అభిప్రాయపడ్డారు. నగరంలోని శివాజీ పార్కులో సాయంత్రం వేళ సేద తీరడానికి వచ్చిన వీరు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తమ మనసులోని భావాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఈ పార్కులోని ఫౌంటైన్ వద్ద ఉన్న అరుగుల్లాంటి రచ్చబండపై కూర్చుని మాట్లాడుకుంటున్న వీరిని 'సాక్షి' పలకరించినప్పుడు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అవి వారి మాటల్లోనే..

ఆ లక్ష కోట్లతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయొచ్చు..



ఏ వనరులు, మౌలిక సదుపాయలు లేని ఒక నగర నిర్మాణానికి కనీసం 30–40 ఏళ్లు పడుతుంది. ఇప్పుడు అమరావతి పరిస్థితి అదే. విశాఖ ఎంతో అందమైన, అన్ని వనరులు ఉన్న నగరం. భారీ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, పోర్టులు, ఎయిర్‌పోర్టు, తూర్పు నావికాదళ ప్రధాన కేంద్రం, ప్రభుత్వ రంగ సంస్థలు వంటివెన్నో ఉన్నాయి. కొత్తగా భోగాపురంలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వస్తోంది. ఇన్ని వనరులున్న విశాఖను వదిలేసి, రెండు పంటలు పండే భూములను నాశనం చేసి, ఏమీ లేని అమరావతిలో రూ.లక్ష కోట్లు వెచ్చించి రాజధానిని నిర్మించడమంటే అనాలోచిత నిర్ణయమే. లోటు బడ్జెట్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ఆ రూ.లక్ష కోట్లతో ఎంతో అభివృద్ధి చేయొచ్చు.

– రాచకొండ దశరథరామయ్య, రిటైర్డ్ చీఫ్ మేనేజర్, ఎస్‌బీఐ

విశాఖను రాజధానిగా కోరుకుంటున్నాం..



విశాఖ రాజధాని కావాలని ఉత్తరాంధ్ర వాసులంతా కోరుకుంటున్నాం. హైదరాబాద్‌లోనే పెట్టుబడులన్నీ పెట్టడం, బాగా అభివృద్ధి చెందాక రాష్ట్రాన్ని విడగొట్టడం, మళ్లీ అదే తరహాలో అమరావతిని రాజధానిగా చేయాలనుకోవడం వంటి పరిణామాలతో విశాఖ రాజధానికి సీఎం జగన్ నడుం కట్టారు. రాష్ట్రంలో రాజధానికి అవసరమైన అన్ని వనరులూ ఒక్క వైజాగ్‌లోనే ఉన్నాయి. ఆదాయమూ బాగా వస్తుంది. విశాఖ క్యాపిటల్ అయితే దక్షిణాది నుంచి ఉత్తరాదికి కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. ముమ్ముందు హైదరాబాద్, ముంబై, చెన్నై, కోల్‌కతా నగరాలతో సమానంగా పోటీ పడుతుంది. – వీరేంద్ర, విశాఖపట్నం


ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి..



ఈ ఐదేళ్లలో విశాఖపట్నం ఎంతో అభివృద్ధి చెందింది. పార్కులు, బీచ్‌లు, రోడ్లు ఎంతో అభివృద్ధి చేశారు. కొత్తగా పరిశ్రమలు, ఐటీ ఇండస్ట్రీస్ విశాఖకు వస్తున్నాయి. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అదానీ, అంబానీ వంటి ప్రముఖ పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారంటే విశాఖలో అన్ని వనరులూ ఉన్నట్టే కదా? పరిపాలనా రాజధాని అయితే వైజాగ్ మరింత అభివృద్ధి చెందుతుంది. చంద్రబాబు వైజాగ్ రాజధానికి వ్యతిరేకం. ఆయనొస్తే విశాఖకు అన్యాయం జరుగుతుంది. విశాఖను రాజధానిగా ప్రకటించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ సీఎంగా ఎన్నుకుంటేనే క్యాపిటల్ అవుతుంది.

– రవికుమార్‌రెడ్డి, వ్యాపారి

రాజధానికి తీర ప్రాంత నగరాలే అనుకూలం..



ప్రపంచంలోను, దేశంలోనూ ప్రముఖ రాజధానులు తీరప్రాంత నగరాల్లోనే ఉన్నాయి. వాషింగ్టన్ పొటమెక్ నదీ తీరాన, లక్నో గోమతీ తీరాన, ముంబై అరేబియా, చెన్నై బంగాళాఖాతం తీరాల్లోనూ రాజధానులుగా ఏర్పడ్డాయి. ఇవన్నీ ఎంతో వేగంగా అభివృద్ధి చెందాయి. విశాఖ కూడా సాగరతీరంలో ఉంది. ఇతర రాజధానులకు లేనన్ని వనరులు ఈ నగరానికే ఉండడం గొప్ప వరం.రాజధానికి కావలసిన అన్ని వనరులు, మౌలిక సదుపాయాలున్న విశాఖను కాదని, ఏమీ లేని అమరావతిలో రూ.లక్షల కోట్లు వెచ్చించి రాజధానిని చేయాలనుకోవడం స్వార్థం కాక మరేమిటి?

– సి.వెంకట్రావ్, రిటైర్డ్ ప్రొఫెసర్, రాజనీతి శాస్త్రం

విశాఖనే క్యాపిటల్ చేయాలి



ఏపీకి రాజధాని కావడానికి అవసరమైన అన్ని వనరులు, హంగులూ వైజాగ్‌కున్నాయి. ఇక్కడ భారీ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలేర్పాటయ్యాయి. ఫార్మా ఇండస్ట్రీస్, అపారెల్ పార్కులూ ఉన్నాయి. ఇండస్ట్రియల్ హబ్‌లూ అభివృద్ధి చెందుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు ఈ ప్రభుత్వం భూములు, రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఇంకా సీపోర్టు, ఎయిర్‌పోర్టు, రోడ్డు, రైలు కనెక్టివిటీ ఉంది. ఏయూ, ఐఐఎం, ఐఐపీఈ వంటి ప్రఖ్యాత విద్యా సంస్థలు, ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలున్నాయి. పర్యాటకం గానూ తిరుగులేని సిటీ. జీఐఎస్ సమ్మిట్‌లో విశాఖలోనే రూ.వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి అంబానీ, అదానీలు ముందుకొచ్చారు. సిటీ ఆఫ్ ప్రాస్పెరిటీ నగరంగా ప్రపంచంలోనే శరవేగంగా వృద్ధి చెందుతున్న విశాఖే క్యాపిటల్ కావాలి. అందుకు పాటు పడుతున్న జగన్‌కే మనం ఓటేయాలి.

– చీకట్ల సూర్యనారాయణ, రిటైర్డ్ ప్రొఫెసర్, కామర్స్ అండ్ మేనేజిమెంట్